క్లుప్తంగా

చెన్నారెడ్డిపల్లివాసికి కలాం ప్రతిభా పురస్కారం


వెన్నా నారాయణరెడ్డి

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన వెన్నా నారాయణరెడ్డికి గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ డాక్టర్ అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. నాగయ్య, గౌరవాధ్యక్షుడు ఎంఎల్సీకే లక్ష్మణరావు నుంచి లేఖ అందినట్లు నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఖాజీపాలెంలోని కేవీఆర్అండ్ ఎంకేఆర్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన ఎందరో విద్యార్థులను ఉద్యోగాల్లో స్థిరపడేలా, ఎన్సీసీలో రాణించేలా కృషి చేశారు. ఏఎన్‌యూ దూరవిద్యకు సంబంధించి కాలానుగుణంగా మారుతున్న భారత ప్రభుత్వం, రాజకీయాలు, ప్రభుత్వ పాలన శాస్త్రం, రాజనీతి శాస్త్ర ప్రాథమిక సూత్రాలు రచించారు. ఈ నెల 20న గుంటూరులో అవార్డు అందుకుంటున్న సందర్భంగా నారాయణరెడ్డిని పలువురు ఉపాధ్యాయులు, స్నేహితులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల, ప్రజాప్రతినిధులు

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. బుడ్డపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి, జెడ్పీటీసీ వెన్నా ఇందిర, సర్పంచ్ పెద్దమస్తాన్, టీడీపీ మండల కన్వీనర్ చిన్నపురెడ్డి, గోపీనాథ్ చౌదరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


గొట్లగట్టు వద్ద దోస పంటలో నిలిచిన వర్షం నీరు


ఆకవీడులో నేలకొరిగిన అరటిచెట్లు


మార్కాపురం : వర్షంలోనే వాహనదారుల రాకపోకలు


పాపాయిపల్లెలో ఇంటిపై పడిన భారీ చెట్టు

పశ్చిమాన అలజడి

మార్కాపురం: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా మార్కాపురం ప్రాంతంలో విస్తారంగా వర్షం కురుస్తోంది. పట్టణంతోపాటు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మార్కాపురం చెరువుకట్టరోడ్డు, డ్రైవర్స్ కాలనీ, మెయిన్‌రోడ్డు, పూలసుబ్బయ్య వీధి, కొండేపల్లి రోడ్డుతోపాటు పరిసర గ్రామాల్లోని రోడ్లపైకి నీరు చేరింది. బుధవారం పలు వివాహాలు ఉన్నప్పటికీ వర్షం కారణంగా వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం మార్కాపురంలో 12 మి.మీ, పొదిలిలో 4.6 మి.మీ, తర్లుపాడులో 13.6 మి.మీ, కొనకనమిట్లలో 12 మి.మీ, పెద్దారవీడులో 7.8 మి.మీ వర్షంపాతం నమోదైంది. కాగా పత్తి చేలల్లో భారీగా వర్షం నీరు నిలిచాయి. అల్పపీడనం వాయుగుండం మారి అధిక వర్షం పడుతుందని అధికారులు హెచ్చరిస్తుండటంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


కొమరోలు : జలమయమైన బీసీ కాలనీ రహదారి


పొదిలి : కాలువలోకి నీటిని తరలిస్తున్న కార్మికులు


నెమలిగుండ్ల వద్ద గుండ్లకమ్మ వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్

■ **అధిక వర్షం.. అపార నష్టం**

బేస్తవారిపేట/రాచర్ల: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా బేస్తవారిపేట మండలంలో 32.8 మి.మీ, అర్ధవీడులో 19.6, కంభంలో 12.2, రాచర్లలో 46.8, కొమరోలు మండలంలో 44.8 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం వేకువజామున 4 నుంచి 10 గంటల వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పొగాకు, పత్తి, కంది, మిరప పంటల్లో వర్షం నీరు నిల్వ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాచర్ల మండలంలోని ఆకవీడులో ఈదురు గాలులకు రైతు ఈశ్వరయ్యకు చెందిన 1100 అరటిచెట్లు నేలకొరిగాయి. కొమరోలు మండలంలోని బాదినేనిపల్లె, సూరవారిపల్లె మధ్యన ఉన్న పులివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మోటుపల్లె-గుంతపల్లి, ద్వారకచర్ల-పాదలకొండపల్లె మధ్య వాగులు పొంగిపొర్లుతున్నాయి.

■ **వర్షంతో అవస్థలు**

కొనకనమిట్ల: భారీ వర్షాల కారణంగా గొట్లగట్టు తుంగనగర్ కాలనీ, వెంగళపల్లి బీసీ కాలనీ, పెదారికట్ల, నాగంపల్లి గ్రామాల్లో అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. పెదారికట్ల బస్టాండ్ నుంచి ఇరసలగుండం వెళ్లే రహదారిపై వర్షం నీరు చేరింది. ఒంగోలు-కర్నూలు రోడ్డుపై గొట్లగట్టు బస్టాండ్ వద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. మినుము, అలసంద, కంది, దోస, మిర్చి, పొగాకు పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

■ **డ్రెయినేజీలోకి వర్షం నీటి మళ్లింపు**

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో సైడు కాలవలపై ఆక్రమణలు తొలగించినప్పటికీ మట్టి కుప్పలు, శిథిలాల కారణంగా వర్షం నీరు రోడ్డుపైనే నిలిచింది. వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు స్పందించారు. పారిశుధ్య సిబ్బంది సాయంతో వర్షం నీటిని డ్రెయినేజీలోకి చేరేలా చర్యలు చేపట్టారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు ఉన్నారు.

■ **ఇంటిపై కూలిన భారీ చెట్టు**

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లెలో పీర్ల చావిడి సమీపంలో భారీ చెట్టు విరిగి ఓ గృహంపై పడింది. చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ తీగలు తెగిపోవడంతో చుట్టు పక్కల గృహాలవారు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ జితేంద్రకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్‌శాఖ అధికారులకు సమస్యను వివరించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

■ **గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

రాచర్ల: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ప్రజలతోపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుండ్లకమ్మ వాగు పరిసర గ్రామాలైన చోళ్లవీడు, జేపీ చెరువులో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వద్ద గుండ్లకమ్మ వాగును పరిశీలించి వీఆర్వో, వీఆర్ఏలకు సూచనలిచ్చారు. ఆయన వెంట ఆర్ఐ రాఘవ, జేపీ చెరువు వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.


కొమరోలు : మోటుపల్లె వద్ద వాగు ఉధృతి



పత్తి, కంది పొలాల్లో నిలిచిన వర్షం నీరు


గొట్లగట్టులో మినుము పైరులో నిలిచిన నీరు

వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి


కొమరోలు : పులి వాగును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


కంభం చెరువును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

● జేసీ గోపాలకృష్ణ

కొమరోలు: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి సమీపంలో ప్రవహిస్తున్న పులి వాగును బుధవారం సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్, ఎంపీడీఓలతో కలిసి జేసీ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రాబోయే రెండు రోజుల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

కొమరోలు తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించి, సమస్యలపై సిబ్బందిని ఆరా తీశారు.

కంభం చెరువు పరిశీలన

కంభం: కంభం చెరువును బుధవారం జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుకు వరద నీరు వచ్చి చేరుతోంది. మరో 24 గంటలు వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

ఆస్పత్రిలో అప్రమత్తంగా ఉండండి

● జీజీహెచ్ సిబ్బందికి సబ్‌కలెక్టర్ సూచన


రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీజీహెచ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి కురిసన వర్షాలకు జీజీహెచ్ ఆవరణలో విద్యుత్ వైర్లు తెగిపోయి సుమారు 8 గంటలపాటు సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో ఆస్పత్రిని తనిఖీ చేశారు. సాయంత్రం 5 గంటలకల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి సబ్‌కలెక్టర్‌కు వివరించారు. వాయుగుండం నేపథ్యంలో రానున్న 48 గంటలపాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని, డెలివరీ అయిన మహిళలను ఇళ్లకు పంపేటప్పుడు మధ్యలో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయేమో కనుక్కోవాలని స్పష్టం చేశారు. నిండు గర్భిణులను గుర్తించి ముందుగానే వైద్యశాలలో చేర్చుకుని సేవలు అందించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న రఫీ

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు బుధవారం కొనసాగింది. రెండో రోజు దీక్షను సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులపై అధికారుల మొండి వైఖరి విడనాడాలని, వారిని విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు చట్టబద్ధంగా తమ విధులను నిర్వహించాలని, నియమ నిబంధనలు పాటించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కార్మికులను విధుల నుంచి తొలగించి వారిని రోడ్డుపాలు చేయడాన్ని ఆక్షేపించారు. నిరసన కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కె.సుబ్బరాయుడు, రమణ, సలాం ఖాన్, శేషిరెడ్డి, యూసఫ్, అల్లూరయ్య, చెన్నకేశవులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి, మిరపలో యాజమాన్యంపై అవగాహన

మార్కాపురం రూరల్: అధిక వర్షాల నేపథ్యంలో పత్తి, మిరపలో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు వివరించారు. బుధవారం మాల్యవంతునిపాడు, కోలభీమునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. పత్తిలో అధిక తేమ వల్ల మొక్కలు పోషకాలు గ్రహించే శక్తిని కోల్పోయి మొక్కలు ఎర్రబడతాయని తెలిపారు. దీని నివారణకు 10 గ్రాములు 19:19:19, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములను లీటరు నీటికి కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. పత్తిలో పూత, కాయ రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఓ రమేష్ మాట్లాడుతూ.. మిరప చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపిన తర్వాత ఎకరాకు 50 నుంచి 60 కేజీల యూరియా, 30 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని సూచించారు. పదునులో 200 కేజీల వేపపిండి వేసుకోవాలని తెలియజేశారు. పొలంలో నీళ్లు నిలబడిన చోట వేరు కుళ్లు ఆశించే ప్రమాదం ఉందని, దీని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాల్యవంతునిపాడు, కోలభీమునిపాడు సర్పంచ్ సుబ్బారెడ్డి, రైతు సేవాకేంద్రం సిబ్బంది నాగమణి, సంధ్య, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

గిద్దలూరు రూరల్: రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లె గ్రామాల రైతులకు బుధవారం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చోళ్లవీడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ

రాచర్ల: అధిక వర్షాల నేపథ్యంలో మండలంలోని చోళ్లవీడు, చినగానిపల్లె, జేపీ చెరువు, అనుములపల్లె, గ్రామాల్లోని మిర్చి పంటపొలాలను బుధవారం ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాలి కారణంగా వాలిపోయిన మిరప మొక్కల మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలని రైతులకు సూచించారు. సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

తర్లుపాడు: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మిరప, వరి, కంది పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఏఓ వెంకటేశ్వర్లు వివరించారు. మండలంలోని నాగెళ్లముడుపు, జగన్నాథపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీఏఏస్ సౌజన్య, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, తిరుమల బాలసుబ్బమ్మ, సిబ్బంది భూపాల్, వెంకట సుబ్బమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: రైతులు పంటల సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాలలో రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఖరీఫ్ పంటల ఈక్రాప్, ఈకేవైసీ జాబితాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో పొరపాట్లు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పశువులకు సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి వివరించారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, ఏఈఓ రవికాంత్, వీఏఏ బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసులు

సగిలేరు వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సగిలేరు వాగు బ్రిడ్జిని బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరిశీలించారు. సగిలేరు పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. వివేకానంద కాలనీలోని కొన్ని గృహాల్లోకి వర్షం నీరు చేరడంతో వారిని పరామర్శించారు. కమిషనర్ డి.వెంకటదాసు, తహసీల్దార్ ఎం.ఆంజనేయులు, వీఆర్ఓ వైపీ రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు దారుణం.. ప్రయాణం నరకం


బేస్తవారిపేట : కేజీబీవీ వద్ద మెయిన్ రోడ్డు దుస్థితి


లోతైన గుంతలతో దరగా వెళ్లే తారురోడ్డు

బేస్తవారిపేట:

బేస్తవారిపేట మేజర్ పంచాయతీలో మెయిన్ రోడ్లు, అంతర్గత రోడ్లు దారుణంగా తయారయ్యాయి. పాత సినిమా హాల్ సెంటర్ నుంచి గ్రామంలోకి, సత్రం బజార్ నుంచి దరగా గ్రామానికి వెళ్లే మెయిన్ రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. తారురోడ్లపై లోతైన గుంతల కారణంగా రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. పాత జేజీఎం పాఠశాల వెనుక వీధి బురదమయమైంది. వర్షాలు కురుస్తుండటంతో రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.


మోకాళ్ల లోతు నీటిలో జేజీఎం పాఠశాల వెనుక వీధి


పొదిలిలో గుంతలు పడిన రోడ్డు

పొదిలిలో ప్రధాన రహదారిపై గోతులు

పొదిలి: పట్టణంలోని ప్రధాన రహదారిపై, పెద్ద మసీదు వద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిల్వ ఉండి, రోడ్డు క్రమేణా శిథిలమవుతోంది. నీరు నిలిచిన సమయంలో గోతులు కనిపించక వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.